## క్లుప్తంగా

### నేడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందన

నూజివీడు: పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని ఆర్డీఓ వై. భవాని శంకరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి కార్యాలయంలో డివిజన్‌లోని ప్రజల నుంచి వారి సమస్యలపై అర్జీలను స్వీకరించి వాటిని గడువులోగా పరిష్కరిస్తామన్నారు.

### జగనన్న ఇళ్లస్థలాలకు రిజిస్ట్రేషన్



ఇబ్రహీంపట్నం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్లు శరవేగంగా సాగుతున్నాయి. నవరత్నాలు ప్రజలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా స్థలాలు కేటాయించిన జగనన్న కాలనీ లబ్ధిదారులు రిజిస్ట్రేషన్ ప్రక్రియ సద్వినియోగం చేసుకుంటున్నారు. కొండపల్లి మున్సిపాల్టీ పరిధిలో 10 వార్డు సచివాలయాల్లో రాత్రీ, పగలు తేడా లేకుండా లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేయడమే లక్ష్యంగా ఉద్యోగులు విధులు చేపట్టారు. ఆదివారం సెలవు అయినప్పటికీ రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు స్థలాలు, లబ్ధిదారుల గుర్తింపు వీఆర్వోలు చేపట్టగా జాయింట్ సబ్ రిజిస్ట్రార్ హోదాలో సచివాలయ కార్యదర్శులు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేస్తున్నారు.

### తహసీల్దార్ శ్రీనివాసరావుకు సన్మానం



మైలవరం: డెప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతితో బదిలీపై వెళుతున్న మైలవరం తహసీల్దార్ ముత్యాల శ్రీనివాసరావును స్థానిక కోదండ రామాలయం తరఫున కమిటీ సభ్యులు ఆదివారం ఘనంగా సన్మానించారు. కోదండ రామాలయం వైస్ ప్రెసిడెంట్ అనుమోలు పెద అప్పారావు, కార్యదర్శి చామర్తి వెంకట కృష్ణమూర్తి మాట్లాడుతూ ముత్యాల శ్రీనివాసరావు మండల ప్రజలకు విశేషంగా సేవలు అందించారన్నారు. విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేశారని ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దారా నాగరాజు, గుడివాడ సుధాకర్‌రావు, కృష్ణమూర్తి, రేపాక శ్రీనివాస్, ఆలమూరి చంద్రం తదితరులు పాల్గొన్నారు.

### వైఎస్సార్ సీపీ వలసపల్లి అధ్యక్షుడిగా మాపర్తి



మునుసూరు: వైఎస్సార్ సీపీ వలసపల్లి గ్రామ అధ్యక్షుడిగా మాపర్తి శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని పార్టీ మండల అధ్యక్షుడు మూల్పూరి నాగవల్లేశ్వరరావు తెలిపారు. ఆదివారం ఆయన అధ్యక్షతన వైఎస్సార్ సీపీ వలసపల్లి గ్రామ సమావేశం జరిగింది. శ్రీనివాసరావును గ్రామ పార్టీ అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు శ్రీనివాసరావుకు ఎంపీపీ కొండా దుర్గాభవాని, జెడ్పీటీసీ డా.వరికూటి ప్రతాప్, వైస్ ఎంపీపీలు రాజానాయన, గంగాధర్, సర్పంచ్ దామోదర్, ఉప సర్పంచ్ దారగాని సుబ్బారావు, సొసైటీ అధ్యక్షుడు దేవినేని సుబ్రహ్మణ్యం, పార్టీ సీనియర్ నాయకులు అభినందనలు తెలిపారు.

### పందెంరాయుడి బైండోవర్

మునుసూరు: కోడిపందేల కోసం వెళుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామని ఎస్‌ఐ పి.వాసు తెలిపారు. ఆదివారం లింగపాలెం మండలానికి చెందిన డి. సురేష్ మండలంలోని లోపూడిలో కోడిపందేలు వేసేందుకు కొంతమందితో కలిసి వస్తుండగా ముందస్తు సమాచారంతో పోలీసులు పట్టుకున్నారు. అతడిని ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఎదుట హాజరుపర్చగా రూ.లక్ష పూచీకత్తుపై బైండోవర్ విధించారని ఎస్‌ఐ చెప్పారు. కోడిపందేలు, జూదాలు నిర్వహిస్తే దాడులు జరిపి కేసులు నమోదుతోపాటు రౌడీషీట్లు తెరుస్తామని ఎస్‌ఐ హెచ్చరించారు.

# విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు

- మారిన ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలు
- నాడు–నేడు పథకంలో పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ
- మొదటి విడతలో 85 పాఠశాలలకు రూ.35 కోట్లు మంజూరు
- రెండో విడతలో రూ.4.18 కోట్లతో అదనపు తరగతి గదుల నిర్మాణం

మొండి గోడలు.. వెలసిన పాఠశాల తరగతి గదుల గోడలు.. విరిగిన బల్లలు.. కరెంటు సదుపాయం లేని తరగతి గదులు.. ఇది గతంలో పాఠశాలల దుస్థితి.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక రంగులతో కళకళలాడుతున్న పాఠశాలలు.. రంగురంగుల బెంచీలు.. తరగతి గదిలో విద్యుత్ సౌకర్యం.. గ్రీన్‌చాక్ బోర్డులు.. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్.. ఇవి ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి.





నాడు–నేడు ఫేజ్–1లో రూ. కోటితో మరమ్మతులు చేసిన తరువాత ఎస్‌ఆర్‌ఆర్ హైస్కూల్ భవనం ; హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్

నూజివీడు: పేద విద్యార్థులు చదువుకుంటున్న ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా ముందు నాడు–నేడు పథకం ప్రారంభించి ఫేజ్–1లో మౌలిక సదుపాయాలను కల్పించారు. నియోజకవర్గంలో 85 పాఠశాలలకు రూ.35 కోట్లు కేటాయించి మంజూరు చేశారు. దీంతో అప్పటివరకు ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోని ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా తీర్చిదిద్దారు. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు బెంచీలను ఏర్పాటు చేయడం, ప్రతి తరగతి గదిలో విద్యుత్ సదుపాయాన్ని కల్పించారు. ఫ్యాన్లు, లైట్లు ఏర్పాటు చేశారు. ప్రహరీలకు విజ్ఞాన సంబంధమైన రంగులతో చిత్రాలు, తరగతి గదుల్లో టైల్స్, పాఠశాల భవనాలకు రంగులు వేయించారు. అన్ని తరగతి గదుల్లో గ్రీన్ చాక్‌బోర్డులు ఏర్పాటు చేయించారు. హైస్కూళ్లలో మినరల్ వాటర్ సదుపాయాన్ని సైతం కల్పించారు. ఇలా ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించడంతో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. దీనికి తోడు విద్యార్థులకు పాఠ్యపుస్తకాల నుంచి రాత పుస్తకాలు, బ్యాగులు, షూ, బెల్ట్ తదితర వాటిని ఉచితంగా ప్రభుత్వం అందజేస్తోంది. అలాగే 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేసి బైజూస్ కంటెంట్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. దీంతో విద్యార్థులు ట్యాబ్‌లను ఉపయోగించి అందులోని పాఠ్యాంశాలను చూడటం ద్వారా విజ్ఞానాన్ని మరింత పెంపొందించుకున్నారు. వీటన్నింటికి తోడు ప్రభుత్వం జగనన్న గోరుముద్ద కార్యక్రమాన్ని అమలు చేస్తూ విద్యార్థులకు రుచికరమైన పౌష్టికాహారాన్ని అందజేస్తోంది.

#### నాడు–నేడు ఫేజ్–2లో రూ.4.18 కోట్లు మంజూరు

విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండి, చాలినన్ని తరగతి గదులు లేని పాఠశాలలను గుర్తించి ఆయా పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని ప్రభుత్వం చేపట్టింది. దీనికి గాను నాడు–నేడు ఫేజ్–2ని ప్రారంభించారు. దీని కింద నూజివీడు మండలంలో పలు హైస్కూళ్లతో కలిపి మొత్తం 35 అదనపు తరగతి గదుల నిర్మాణానికి గాను రూ.4.18 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. పట్టణంలోని ఎస్‌ఆర్‌ఆర్ హైస్కూల్‌లో రూ.1.44 కోట్లతో 12 తరగతి గదులను, జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్‌లో రూ.1.08 కోట్లతో 9 తరగతి గదులను, గొల్లపల్లి హైస్కూల్‌లో రూ.94 లక్షలతో 8 తరగతి గదులను, మీర్జాపురం హైస్కూల్‌లో రూ.72 లక్షలతో 6 తరగతి గదులను నిర్మిస్తున్నారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఇంత పెద్ద ఎత్తున హైస్కూళ్ల అభివృద్ధికి కృషి చేసిన దాఖలాలు లేవు. ఈ అదనపు గదుల నిర్మాణం పూర్తయితే విద్యార్థులకు మరింత సౌకర్యవంతంగా ఉంటుంది.

#### మౌలిక సదుపాయాలు కల్పించారు



నాడు–నేడు పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను కల్పించి వాటి రూపురేఖలనే మార్చివేశారు. గతంలో ఏ ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వలేదు. ప్రస్తుతం అదనపు తరగతి గదులను సైతం నిర్మిస్తున్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలున్నాయి.

– గాదెరెడ్డి రంజిత్‌రెడ్డి, నూజివీడు

#### స్మార్ట్ టీవీల ద్వారా పాఠాలు



ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అనేక సదుపాయాలను కల్పించింది. యూనిఫాం, పుస్తకాలు, బ్యాగులు తదితర వాటినన్నింటిని ఉచితంగా అందిస్తోంది. బెంచీలు ఏర్పాటు చేయడంతో పాటు స్మార్ట్ టీవీల ద్వారా పాఠాలను సైతం ఉపాధ్యాయులు బోధించేలా చర్యలు తీసుకుంది.

– నక్కనబోయిన వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచి, తూర్పుదిగవల్లి

### ట్రిపుల్ ఐటీలో స్వచ్ఛ భారత్



నూజివీడు: స్థానిక ట్రిపుల్ ఐటీలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ – 3 ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు ఫ్యాకల్టీ బ్లాక్‌ల వెనుక ఉన్న చెత్తాచెదారాన్ని, ప్లాస్టిక్ వ్యర్థాలను, పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చని ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ శ్రావణి అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటితో పాటు పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకోవడం, మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం ద్వారా దోమల బెడదను పూర్తిగా అరికట్టవచ్చన్నారు. తద్వారా దోమల వల్ల వ్యాప్తి చెందే వ్యాధులను పూర్తిగా నివారించవచ్చని వివరించారు. ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ – 3 ప్రోగ్రాం ఆఫీసర్ జాజుల మధు, విద్యార్థులు పాల్గొన్నారు.

### సిమెంట్ పలకలు ఏర్పాటు చేయండి



ఆగిరిపల్లి: స్థానిక బ్రాహ్మణ బజార్‌లోని విజయవాడ – నూజివీడు రహదారి పక్కనే దమ్మన్న మండపం వద్ద ఉన్న డ్రెయినేజీపై శ్లాబ్ లేకపోవడంతో ప్రమాదం పొంచి ఉంది. గతంలో ఇక్కడ సిమెంట్ బల్లలు నిర్మించడంతో మండపానికి సిమెంటు రోడ్డుకు మధ్య కొంత ఖాళీ ఏర్పడింది. నాపరాళ్లు వేసి మమ అనిపించారు. గతంలో లారీ ఒకటి ఖాళీలో చొరబడడంతో నాపరాళ్లు విరిగిపోయాయి. దీంతో అక్కడ పెద్ద గొయ్యి ఏర్పడింది. ఈ గొయ్యిలో ఇప్పటివరకు అనేక సార్లు కార్లు, ద్విచక్ర వాహనాలు పడి ప్రమాదాలు జరిగాయని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సిమెంట్ రోడ్డుకు–మండపానికి మధ్య ఏర్పడిన గొయ్యిపై సిమెంట్ పలకలు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

### విద్యార్థులకు ప్రోత్సాహక నగదు ప్రదానం



విస్సన్నపేట: కాపు అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్స్ ఎయిడ్ ఫర్ పూర్ చారిటబుల్ ట్రస్ట్, కృష్ణదేవరాయ పేద బలహీన వర్గాల సహాయ నిధి ఆధ్వర్యంలో ప్రతిభావంతులైన పేద విద్యార్థులు 231 మందికి రూ.7.60 లక్షలు ప్రోత్సాహక నగదు బహుమతులను అందజేశారు. స్థానిక వికాస్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఆదివారం కోపా ట్రస్ట్ చైర్మన్ బండి గోపాలరావు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. కృష్ణదేవరాయ పేద, బలహీన వర్గాల సహాయనిధి ట్రస్టీ తులసీ రామచంద్ర ప్రభు, రిటైర్డ్ డివిజినల్ ఇంజినీర్ చందన రామమోహనరావు, ప్రతిభా విద్యా సంస్థల డైరెక్టర్ లక్కినేని ప్రసాద్, కోపా ట్రస్ట్ డైరెక్టర్ తుంగల నరేంద్రబాబు, ఎరుబండి వెంకట కృష్ణారావు మాట్లాడారు.

## జెడ్పీటీసీ లోకేశ్వరరెడ్డికి స్వామిదాసు పరామర్శ



లోకేశ్వరరెడ్డిని పరామర్శిస్తున్న స్వామిదాసు, నాయకులు

పుట్రేల (విస్సన్నపేట): జెడ్పీటీసీ సభ్యుడు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డికి ఇటీవల కాలుకు ఫ్యాక్చర్ కావటంతో హైదరాబాద్‌లో చికిత్స పొంది ఇంటికి తిరిగి వచ్చారు. ఆయనను వైఎస్సార్‌సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు ఆదివారం పరామర్శించారు. మండలంలోని అన్ని గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు లోకేశ్వరరెడ్డిని పరామర్శించారు. ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, పుట్రేల, విస్సన్నపేట సర్పంచ్‌లు కారుమంచి స్వాతి, ఎస్. నాగమల్లేశ్వరి, వైస్ ఎంపీపీలు గాజుల శ్రీనివాసరావు, రెడ్డి శ్రీనివాసరావు, మాజీ వైస్ ఎంపీపీ ఓలేటి దుర్గారావు, కేడీసీసీబీ డైరెక్టర్ భూక్యా రాణి, అనుమోలు శివబాజీ, రెడ్డి శేషగిరి, కోటగిరి సునీల్‌బాబు, గంటల నాగాచారి, అల్లు గణపతిరెడ్డి, మారేశు, మణి, తిరుపతిరావు పాల్గొన్నారు.

## మంత్రి జోగి రమేష్‌ను కలిసిన ఎంపీడీఓ



మంత్రి జోగి రమేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన జి కొండూరు ఎంపీడీఓ శ్రీనివాసరావు, మందా జక్రధరరావు

ఇబ్రహీంపట్నం: రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్‌ను జి కొండూరు నూతన ఎంపీడీఓ అడిగోపుల శ్రీనివాసరావు ఇబ్రహీంపట్నంలోని ఆయన నివాసంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రిని శాలువాతో సత్కరించి పరిచయం చేసుకున్నారు. ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించానని మంత్రికి తెలిపారు. మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు సక్రమంగా అమలు జరిగేలా చూడాలని సూచించారు. జి కొండూరు జెడ్పీటీసీ మందా జక్రధరరావు, దుగ్గిరాలపాడు సర్పంచి జడ రాంబాబు పాల్గొన్నారు.

## అపూర్వం.. ఆత్మీయ సమ్మేళనాలు



నూజివీడు ధర్మ అప్పారావు కళాశాల పూర్వ విద్యార్థులు



తిరువూరులో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

నూజివీడు: పట్టణంలోని ధర్మ అప్పారావు కళాశాలలో 1974–77లో బీకాం చదువుకున్న విద్యార్థులు ఆదివారం పట్టణంలోని ఎస్‌ఆర్‌ఆర్ కళాశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా 46 ఏళ్ల కిందట చదువుకున్న విద్యార్థులంతా ఒకే చోట చేరి ఆనాటి తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. సాయంత్రం వరకు స్నేహితులంతా కలిసి ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. ఒకరికొకరు క్షేమ సమాచారం తెలుసుకున్నారు. కార్యక్రమాన్ని కందుల శంకరరావు, బండి రామ్మోహన్‌రావు, జి. నాగరాజు, క్రోసూరు రమేష్, డీవీ నాగేశ్వరరావు నిర్వహించారు.

- తిరువూరు: తిరువూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1987–89 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం తిరువూరు రాజుపేట మామిడి తోటలో ఆదివారం కోలాహలంగా జరిగింది. మూడు దశాబ్దాల తర్వాత కలుసుకొన్న బాల్య స్నేహితులు రోజంతా ఉత్సాహంగా గడిపారు. ముందుగా స్నేహితులు ఒకరికొకరు క్షేమ సమాచారం అడిగి తెలుసుకున్నారు. కుటుంబీకులకు తమ బాల్య స్నేహితులను పరిచయం చేసుకున్నారు. ఆర్థికంగా వెనుకబడి ఇబ్బందులు పడుతున్న పూర్వమిత్రుల కోసం ఫండ్ సేకరించి అందజేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఎన్‌ఆర్‌ఐ ఎరుబండి ఉమా నాగేశ్వరరావు, నదికుదిటి ఫణీష్, చిత్తలూరి సోమశేఖర్, పరసా నెహ్రూజీ, కిరణ్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

### అరుణాచలానికి ప్రత్యేక బస్ సర్వీసు

తిరువూరు: తిరువూరు నుంచి అరుణాచలం పుణ్యక్షేత్రానికి సూపర్ లగ్జరీ ప్రత్యేక బస్ సర్వీసును ఈనెల 22వ తేదీన ఏర్పాటు చేశామని తిరువూరు డిపో మేనేజర్ ఎ. వేణు తెలిపారు. ఆ రోజు సాయంత్రం నాలుగు గంటలకు తిరువూరు నుంచి బస్ బయలు దేరుతుంది. 23వ తేదీన కాణిపాకం, శ్రీపురం(గోల్డెన్ టెంపుల్), రాత్రికి పౌర్ణమి సమయానికి అరుణాచలం చేరుకుంటుంది. గిరి ప్రదక్షిణ, దర్శనానికి తగిన సమయం కేటాయిస్తారు. 24వ తేదీన కంచి, తిరుత్తణి పుణ్యక్షేత్రాల దర్శనం, తదుపరి తిరుగు ప్రయాణంలో శ్రీకాళహస్తిలో దర్శనం, 25వ తేదీ రాత్రికి తిరువూరు చేరుకొంటుంది. రానుపోను చార్జీ తిరువూరు నుంచి రూ.2,800, విజయవాడ నుంచి రూ.2,500 చెల్లించాలన్నారు. ప్రయాణికులు ఆన్‌లైన్‌లో కూడా తమ టిక్కెట్లను బుక్ చేసుకోవచ్చని చెప్పారు. ఇతర వివరాలకు సెల్: 98856 61835 నంబర్‌ను సంప్రదించవచ్చన్నారు.


## ● సండే @ స్మృతివనం



నగరంలోని బీఆర్ అంబేడ్కర్ స్మృతివనంలో సందడి నెలకొంది. ఆదివారం పెద్ద సంఖ్యలో సందర్శకులు తరలిరావడంతో స్మృతివనం ప్రాంగణమంతా కిటకిటలాడింది. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ జీవిత విశేషాల దృశ్యాలు, వివిధ ఆకృతులను సందర్శకులు తిలకించారు. సాయంత్రం సమయంలో స్మృతివనం విశేషంగా ఆకట్టుకుంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





## చెక్కపల్లిలో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం



మునుసూరు: పల్లె సీమల్లోని మహిళల ఆర్థిక చేయూతకు తపన ఫౌండేషన్ విస్తృతంగా కృషి చేస్తోందని ఫౌండేషన్ అధినేత గారపాటి చౌదరి సతీమణి గారపాటి రేణుక అన్నారు. మండలంలోని చెక్కపల్లిలో ఆదివారం తపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో మూడు నెలల ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ టి.రాధిక అధ్యక్షతన ఆమె ప్రారంభించారు. శిక్షణ కేంద్రం ద్వారా మహిళల జీవనోపాధికి, స్వయం సమృద్ధికి తోడ్పాటును అందిస్తామని, మహిళలంతా వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ సొసైటీ అధ్యక్షుడు కాటేపల్లి లింగారావు, ఎంపీటీసీ పుష్పవతి, మాజీ జెడ్పీటీసీ సీహెచ్ వెంకటేశ్వరరావు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

జి.కొండూరు: మండల పరిధి చెవుటూరు గ్రామ శివారులో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఇద్దరు గాయాలపాలయ్యారు. సేకరించిన వివరాల ప్రకారం.. ఏలూరు జిల్లా అయ్యప్పరాజుగూడెంకు చెందిన గోపి, వెంకటేశ్వరరావు ఇద్దరు తమ గొర్రెల మందతో కలిసి వచ్చి చెవుటూరు గ్రామ శివారులో నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్న సమయంలో తాగునీరు తెచ్చుకునేందుకు గోపి, వెంకటేశ్వరరావు తమ ద్విచక్రవాహనంపై మైలవరం వైపు బయలుదేరారు. అదే సమయంలో విజయవాడ వైపు నుంచి మైలవరం వైపునకు వస్తున్న ద్విచక్ర వాహనం గోపీ, వెంకటేశ్వరరావుల వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గోపీకి తీవ్ర గాయాలు కాగా మరో ద్విచక్ర వాహనంపై వస్తున్న విజయవాడకు చెందిన అమ్ములు అనే మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో మైలవరం ప్రభుత్వాస్పత్రికి అక్కడి నుంచి విజయవాడకు తరలించారు.